క్లుప్తంగా

విద్యార్థుల ఉన్నతికి కృషి



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

కందుకూరు: విద్యార్థుల ఉన్నతికి అందరూ కృషి చేయాలని బాచుపల్లి సర్పంచ్ యాలాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని బాచుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. మంత్రి సబితారెడ్డి చొరవతో విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా వసతులు కల్పిస్తున్నారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థికి నడవడానికి ఉపయోగించే స్టాండ్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు రాజేష్, ధనలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సందడిగా ఫ్రూట్స్‌డే



పండ్ల వేషధారణలో చిన్నారులు

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడ లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం ఫ్రూట్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు రకాల పండ్ల వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ బీరప్ప మాట్లాడారు. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, భాషానైపుణ్యం పెంపొందించేలా, ప్రత్యక్షంగా అర్థమయ్యే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఫ్రూట్స్ డేలో భాగంగా ప్రతి పండు తినడం ద్వారా కలిగే లాభాలు, ప్రయోజనాలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ సంతోష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుల పరిశీలనలో మున్సిపల్ సిబ్బంది

తుక్కుగూడ : 'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలనను మున్సిపాలిటీ అధికారులు ముమ్మరం చేశారు. ఈ నెల12వ వరకు గృహలక్ష్మి పథకం కింద మున్సిపాలిటీ వ్యాప్తంగా 500 దరఖాస్తు వచ్చాయి. వార్డుల వారీగా ఇంటింటికీ తిరిగి అధికారులు దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలిస్తున్నారు. వార్డుల వారీగా అధికారులు, సిబ్బందిని కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ తెలిపారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రచారం



మేనిఫెస్టోపై ప్రచారం చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 26వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం శనివారం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి అందచేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మహిళలకు స్కూటీ, వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఇస్తామంటూ ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శ్రీను, అనిల్‌కాంత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వరణ్, ఫర్వీజ్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ ధర్మకర్తగా యాదగిరి



మంత్రిని కలిసిన యాదగిరి, అనిల్‌యాదవ్

మీర్‌పేట: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయ పాలకమండలి ధర్మకర్తగా మీర్‌పేట కార్పొరేషన్ 16వ డివిజన్ శ్రీసాయికృపానగర్ కాలనీకి చెందిన మేకల యాదగిరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి శనివారం స్థానిక కార్పొరేటర్ ఎనుగుల అనిల్ యాదవ్‌తో కలిసి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు వజ్రాయుధంతో సమానం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



5 కే రన్‌లో పాల్గొన్న అధికారులు, స్థానికులు

హుడాకాంప్లెక్స్: ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి చింతలకుంట వరకు నిర్వహించిన 5కే రన్‌లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అర్హతగల వారందరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఓటింగ్ రోజు సెలవుదినం కాకుండా మన హక్కుల పరిరక్షణ కోసం విధిగా ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ఓటింగ్‌లో పాల్గొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని ఆయన కోరారు. గత 25 సంవత్సరాలుగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో జరిగిన ఎన్నికల్లో కేవలం 40 నుంచి 49 శాతం ఓటింగ్ నమోదు అవుతోందని, వచ్చే ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు రవీందర్ కుమార్, దశరథ, అరుణ, ఎల్‌బీనగర్ ఏసీపీ జానకిరెడ్డి, పోలీసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది

కందుకూరు: ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని తహసీల్దార్ గోపాల్ అన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ శనివారం కందుకూరు ఆర్డీఓ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది, స్థానిక యువతతో కలిసి 5 కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొంది, ఎన్నికల్లో తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలన్నారు. దీంతో మంచి పాలకులను తాము ఎన్నుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ శ్రావణ్, నాయబ్ తహసీల్దార్లు తాజుద్దీన్, అవినాష్, సర్వేయర్లు పాండురంగారెడ్డి, శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీను, ప్రేమ్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మరు

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని మంత్రి సబితా రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఎంపీటీసీ నడికూడ రమేష్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టి మతతత్వ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపు కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరని తెలిపారు. మహేశ్వరంగడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధిలో మహేశ్వరం నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు తమ పార్టీలో తగిన గుర్తింపునిచ్చి గౌరవిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దేవులానాయక్, పార్టీ సీనియర్ నాయకులు విద్యాకర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, నాయకులు జగన్, సిద్దు, రాజేష్, నాయక్, కృష్ణనాయక్, కుమార్, నర్సింహ, నరేష్, బీరప్ప, వినోద్, శంకర్, దేవులా, రాజేష్,కిరణ్, శ్రీనివాస్, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

కార్మికులను రెగ్యులరైజ్ చేయండి



నిరసనలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవాణి

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం కార్మికులు చేపట్టిన నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: మండలంలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్‌లోని సీతారాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు తమలపాకులతో అర్చన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు శ్రీసత్యనారాయణ వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ అంజనేయస్వామి అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయ పూజారి సంతోష్ శర్మ, వీరేశం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లపై దాడులను అరికట్టాలి

తుర్కయంజాల్: క్రైస్తవులుగా దేశ అభివృద్ధి, శాంతి, క్షేమాన్ని కోరుచున్నామని, హింసను కాదని కౌన్సిలర్ కాకుమాను సునీల్, బాలయేసు, అద్భుత పుణ్యక్షేత్రం ఫాదర్ వి.జే. చిన్నప్పరెడ్డిలు పేర్కొన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు నిరసనగా తుర్కయంజాల్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ జి.సువర్ణ రాజు, యేసుబాబు, రాజుతో పాటు పెద్ద సంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

కడ్తాల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కర్కల్‌పహాడ్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు మైలారం రాజు అన్నారు. శనివారం మండలంలోని కర్కల్‌పహాడ్‌లో నూతనంగా ఎన్నికైన అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు మైలారం రాజుతో పాటు, కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీను, రాజు, రమేష్,జగన్, అంజి, శివకృష్ణ, నాని, బాలు, శ్రీశైలం ఉన్నారు.

బాధితురాలికి మేయర్ పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: గిరిజన మహిళ లక్ష్మిని పోలీసులు అమానుషంగా హించించి, తీవ్రంగా కొట్టడంతో కర్మన్‌ఘాట్‌లోని జీవన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శనివారం బాధితురాలిని మేయర్ చిగురింత పారిజాత పరామర్శించారు. బాధితురాలితో మాట్లాడి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడులు చేయడం ఇదేం ఫ్రెండ్లీ పోలీసింగ్ అని నిలదీశారు. ఇలాంటి నీచమైన చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని అన్నారు. వెనకబడిన కులాలపై దాడులు చేయడం పోలీసులకు పద్ధతి కాదని హితవు పలికారు. దాడికి పాల్పడిన పోలీసులను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. లంబాడీల హక్కుల భద్రత కోసం అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేటర్ దర్శన్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంజిత్, సంధ్య ఉన్నారు.

బస్‌సర్వీసును పునరుద్ధరించాలని వినతి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న జంగారెడ్డి

కందుకూరు: మండలంలోని దెబ్బడగూడకు ఆర్టీసీ బస్ సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ.. పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి శనివారం ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్డు వేసి ఎవరూ రాకుండా రాళ్లు అడ్డుపెట్టగా, గ్రామానికి వచ్చిన బస్సు సీసీ రోడ్డుపై నుంచి వెళ్లడంతో రోడ్డు దెబ్బతినిందన్నారు. దీంతో కొందరు డ్రైవర్‌ను తిట్టడంతో మహేశ్వరం డిపో మేనేజర్ ఈ నెల 16 నుంచి మా గ్రామానికి బస్సు సర్వీసును నిలిపివేశారని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే మా ఇష్టం అంటున్నారని వాపోయారు. వెంటనే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని డిమాండ్ చేవారు.

ప్రాచీన ఆలయాల ప్రాశస్త్యాన్ని కాపాడాలి



ప్రారంభోత్సవంలో పాల్గొన్న శివకుమార్

పహాడీషరీఫ్: ప్రాచీన ఆలయాల ప్రాశస్త్యం కాపాడేందుకు దాతలు ముందుకు రావడం హర్షణీయమని మామిడిపల్లి 11వ డివిజన్ కార్పొరేటర్ సుక్క శివకుమార్ అన్నారు. మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ పడమటి సింహద్వారం రాజగోపురం, ప్రాకారం నిర్మాణం చేయించేందుకు ప్రముఖ దాత దామోదర్ సచిన్ సోని ముందుకొచ్చారు. నిర్మాణ పనులను ఆలయ చైర్మన్ కోట్ల వెంకటేశ్ వాల్మీకితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. లాక్‌డౌన్ నుంచి దాతల సహాయ సహకారాలతో ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కొలువుదీరిన ఈ ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సచిన్‌తో పాటు ఈవో మురళీకృష్ణ, కమిటీ సభ్యులు పద్మ శంకర్, కృష్ణ, సహదేవ్, అశోక్ ముదిరాజ్, ఆలయ అర్చకులు సుధీర్ పంతులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ అధ్యయన యాత్ర



ముగింపు సమావేశంలో ఎస్ఎఫ్ఐ నేతలు

ఇబ్రహీంపట్నం: గత రెండు రోజులుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై నిర్వహించిన అధ్యయన యాత్ర శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ మాట్లాడుతూ.. యాచారం, మంచాల మండలాల మీదుగా ఈ యాత్ర సాగిందన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు, భోజన వసతి సరి గ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు విప్లవ్‌కుమార్, శ్రీకాంత్, వినోద్, వంశీ, వినయ్, లక్ష్మణ్, సంపత్, శంకర్‌లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే భోజనం



తలకొండపల్లిలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

- గదుల కొరత, అందని క్రీడాసామగ్రి
- విద్యార్థులకు ఇవ్వని పరుపులు

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ పాఠశాలను శనివారం మధ్యాహ్న భోజన సమయంలో సాక్షి విజిట్ చేయగా ఆకుకూరతో కూడిన పప్పు , సాంబార్, అన్నం వడ్డించారు. వారానికి రెండు సార్లు అరటిపండు, గుడ్లు, ఆదివారం చికెన్‌తో కూడిన బగారా రైస్ అందిస్తున్నారని, ఉదయం జీరా రైస్, రాగి మాల్ట్ అందిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఆయా పాఠశాలలో మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నా ఇతరత్ర సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయని సాక్షి దృష్టి వచ్చాయి. 200 మంది విద్యార్థులు ఉన్న మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల అద్దెభవనంలో కొనసాగుతుండగా, విద్యార్థులకు గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వం నిర్మిస్తున్న కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో విద్యార్థులకు అద్దెభవనంలో ఇబ్బందులు తప్పడం లేదు. త్వరగా నూతన భవన నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో 290 మంది వరకు విద్యార్థులు ఉండగా, వారికి నేటికి పరుపులు అందలేదని, కొన్ని గదులకు కిటికీలు లేవని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. అలాగే, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 420 మంది విద్యార్థులు ఉండగా , శనివారం 355 మంది విద్యార్థులు వసతిగృహంలో ఉన్నారు. పాఠశాలలో తరగతి గదులు చాలక పోవడంతో, స్టాఫ్‌కు కేటాయించిన గదులలో పలువురు విద్యార్థులు వసతి పొందుతున్నారు. చాలా మంది విద్యార్థులకు ఎలాంటి బెడ్ సౌకర్యం లేక పోవడంతో నేలపైనే పడుకుంటున్నామని విద్యార్థులు వాపోయారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూమ్స్ లేవని, ఆట స్థలం సరిగ్గా లేదని, క్రీడాపరికరాలు రాలేదని విద్యార్థులు చెప్పారు.

భోజనం అందిస్తున్నారు..

తలకొండపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాంలు పంపిణీ చేశారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు విద్యార్థినులు తెలిపారు.

రాజ్యాధికారం కోసం కృషి చేద్దాం

శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: బడుగుల రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ పేర్కొన్నారు . శుక్రవారం రాత్రి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీలోనైనా తన వారికి సీట్లు వస్తే ఓట్లు వేసి గెలిపించుకోవాలని కోరారు. మహిళా సాధికారితకు పాటుపడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లతో సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. అలాగే, గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ ,ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక, పీసీసీ సభ్యులు శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్ , హరిదాసులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెరిగిపోని జ్ఞాపకం ఫొటో



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఫొటో గ్రాఫర్లు

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

కడ్తాల్: గడిచిపోయిన కాలం మధుర స్మృతులను, మదిలో ముద్రించే చెరిగిపోని జ్ఞాపకమే ఫొటో అని మండల ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. కడ్తాల్ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితమహుడు 'లూయిజ్ జాక్వెస్ మండే డాగురే' చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లు ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఫొటో గ్రాఫర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. నేడు ఫొటోగ్రఫీతో ఎంతో మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఫొటో గ్రాఫర్ల సంక్షేమానికి బ్యాంకుల ద్వారా పెద్ద మొత్తంలో రుణాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘం ఉపాధ్యక్షుడు రబ్బానీ, కార్యదర్శి బీష్మాచారి, కోశాధికారి కిరణ్, శ్రీను, మహేశ్, కృష్ణ, ధనంజయ్‌గౌడ్, శివ, మహేందర్, నవీన్, ప్రవీణ్, నదీమ్ ఉన్నారు.

యాచారంలో..

యాచారం: మండల కేంద్రంలో 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరిపారు. ఫొటో సృష్టికర్త లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేటి ఆధునిక యుగంలో రకరకాల మొబైల్ ఫోన్లు రావడంతో ఫొటోగ్రాఫర్లకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాల్సిన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేష్ యాదవ్, లింగం, నద్దె విజయ కుమార్ పాల్గొన్నారు.

తలకొండపల్లిలో ..

తలకొండపల్లి: మండల కేంద్రంలో శనివారం ఫొటో గ్రఫర్ యూనియన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి తమ ఐక్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, శంకర్, యాదగిరి, రవూఫ్, మధు, విజయ్, ఆంజనేయులు, నాగేష్, నర్సింహ, కృష్ణ, చెన్నకేశవులు, మహేష్, మల్లేష్, శ్రీను, కిరణ్, సాయి, రంగా పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితమహుడు లూయిస్ డాగరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. అనంతరం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కుటుంబ భరోసా స్కీంలో చేరాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ భరోసా రూ.100 స్కీం ప్రారంభించిందని, ఆసక్తి గల వారు పథకంలో చేరాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ శ్రీశైలం, వెంకటేష్, జావీద్, గిరి, వెంకటేశ్, గణేశ్, హలీమ్, జబ్బార్, విజయ్, బిక్కు, శివకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.